క్లుప్తంగా

పైడితల్లి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

డెంకాడ: మండలంలోని జొన్నాడ పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయన్ని దేవ దాయ, ధర్మాదాయ అధికారుల ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. అమ్మవారి జాతర పూర్తి కావడంతో అధికారులు పీవీ లక్ష్మి, సీఎఫ్ఓ కె.నాగేంద్ర, ఈఓ దారగంగామ్మ, ధర్మకర్త జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించగా.. హుండీల ద్వారా 6,50,427 రూపాయలు... అన్నదానానికి విరాళాల రూపంలో 1,68,879 వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జొన్నాడ సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, ఆకుపేట సర్పంచ్ సువ్వాడ రమేష్, గ్రామపెద్దలు కోరాడ కోటినాయుడు, త్రిపురగిరి మురళి, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో సాగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఎంఈఓ విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్ సేవా దృక్పథంతో నడిచే గొప్ప సంస్థ అని, శిక్షణను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిన్నంనాయుడు, ఉపాధ్యక్షుడు త్రినాథనాయుడు, ప్రిన్సిపాల్ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ మధు

విజయనగరం అర్బన్: అబాకస్ ఆన్‌లైన్ పోటీల్లో పట్టణానికి చెందిన ఫోర్ట్‌సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం జరిగిన పోటీల్లో ఐదుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ రొయినాఖాన్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల చైర్మన్ కేపీ రాజు (శివ), వైస్ చైర్మన్ చంటి, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినందించారు.

సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

శృంగవరపుకోట: ఎల్.కోట మండలంలోని కళ్లేపల్లి పంచాయతీ పరిధి సీతాగొర్లెవానిపాలెం గ్రామంలో సంపత్ వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని వేదపండితులు నేతేటి మధు కుమార్ శర్మ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి పుణ్యాహవచ నం, పరిషత్ ప్రాయశ్చిత్తం, రుత్విక్ వరు ణ, మండపారాధన, అనంతరం 1,116 కలశాలతో కుంబాభిషేకం, అర్చన, అష్టద్రవ్య హోమం, పూర్ణాహుతి తీర్థగోష్టి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన, 3గంటలకు కోలా టం, సాయంత్రం 6.30గంటలకు భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

వల్లంపూడిలో నేత్ర వైద్యశిబిరం



వృద్ధుడికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ వెంకటేష్‌రెడ్డి

వేపాడ: మండలంలోని వల్లంపూడి శివాలయం ప్రాంగణంలో స్థానిక బాపూజీ చేనేత సహకార సంఘం సభ్యుడు కవల సత్యనారాయణ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ ఎన్‌జీఓ సౌజన్యంతో గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో ఆప్తాలమిక్ వెంకటేష్ రెడ్డి 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 10 మందిని నేత్ర శస్త్ర చికిత్సల నిమిత్తం విజయనగరం మహారాజ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. అందచేసారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఎన్‌జీఓ సభ్యులు ప్రసన్నకుమార్, దీపక్, రమేష్‌బొమ్మన తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో అవినీతి నిర్మూలన

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: సన్మానగ్రహీతలతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రజా ప్రతినిధులు

భోగాపురం: వలంటీర్ వ్యవస్థతో అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్లు తమ సేవలతో ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. అవగాహన లేని ప్రతిపక్ష పార్టీల నాయకులు వలంటీర్లు, ప్రభుత్వం మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషి చేయాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. అనంతరం సేవావజ్ర అవార్డు పొందిన భోగాపురం గ్రామానికి చెందిన బత్తుల దినేష్, తిరుమరెడ్డి ప్రసాద్, సేవారత్న పొందిన పబ్బిరెండి రవి, బి. వెంకటలక్ష్మి, రౌతు రామలక్ష్మి, ఇప్పిలి శ్రీను, కోరాడ రామతులసిలతో పాటు 292 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలికుడు నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీ పడాల సత్యవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, పడా శ్రీనివాసరావు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, సుందర హరీష్, ఎంపీడీఓ చంద్రకళ, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ జి. చంద్రకళ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని కొన్ని గ్రామాల్లో చెరువులు లేనందున ఉపాధి వేతనదారులకు వేరే పంచాయతీల్లో పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఆదిబాబుకు సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను సుమారు రూ.38 లక్షల ఎంపీపీ నిధులతో మండలంలోని వివిధ పంచాయతీల్లో 30 నూతన బోర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ అనూషారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వచ్చే నెలలో ప్రారంభించబోయే సమ్మర్‌క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా 650 బోర్లకు మరమ్మత్తులు చేపట్టేందుకు మెటీరియల్‌ను కొనుగోలు చేశామన్నారు. అమటాం రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కుళాయిలు వేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ పంచాయతీలో గోతులు తీసి పైప్‌లైన్లు వేశారని, అయితే ఇంతవరకు గోతులు పూడ్చలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరగా గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌ను ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి మాట్లాడుతూ.. వచ్చేనెల 3, 4, 5 తేదీలలో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీ పడాల సత్యవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలే నా బలం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజల తన బలమని, ఆ బలంతోనే ప్రజాసేవ చేస్తున్నానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పునరుద్ఘాటించారు. తన స్వగృహంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. మరోసారి శాసనసభ్యుడిగా గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చారు. ఐదేళ్ల తన పదవీకాలంలో నగరాన్ని సరికొత్తగా అభివృద్ధి చేశానని చెప్పారు. మారుమూల ప్రాంతాలలో సైతం సీసీ రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ప్రతిపక్షం ఏమీ చేయలేకనే తనపై వ్యక్తిగత ఆరోపణలకు దిగుతోందన్నారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని తాము అడుగుతుంటే.. ప్రతిపక్షాలు ప్రజల ముందుకు వెళ్లడానికి భయపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘ ప్రతినిధులు కురువాడ సూరిబాబు, ఉప్పిడి సత్యనారాయణ, బందారు శ్రీనివాసరావు, కాదులూరి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులు

విజయనగరం: కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. దాసన్నపేట రథం సెంటర్‌లోని కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ వార్షికోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. అంతకుముందు కోలగట్లకు ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధి బోడసింగి ఈశ్వరరావు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో ఖాళీగా ఉన్న 29 వార్డు వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు గాను ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలో గల సచివాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నగర పంచాయతీ పరిధిలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో ఖాళీ అయిన వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ పి. బాలాజీప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగర పంచాయతీలో 8 వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిలో జరజాపుపేట - 1, మొయిద జంక్షన్ - 1, అగురువీధి - 3, ఇందిరాకాలనీ - 1, గాంధీనగర్ కాలనీ - 2 సచివాలయాల పరిధిలో ఖాళీలున్నాయని తెలిపారు. ఈ నెల 23 నుంచి 26లోగా ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మార్చి3న పల్స్ పోలియో

వేపాడ: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి.ఉమ కోరారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి నేతృత్వంలో మండల కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో అయిదేళ్ల లోపు ఉన్న 3,645 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయాల్సి ఉందన్నారు. 3వ తేదీన పోలియో చుక్కలు వేయని చిన్నారులకు, 4,5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయాలని సూచించారు. సీహెచ్ఓ ఆంజనేయులు, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని తారమాపల్లి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించనున్నారని పీఆర్ జేఈ వీరలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు. అలాగే అదే గ్రామంలో 'గ్రామసందర్శన' కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గ్రామంలో పర్యటిస్తారని, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నూతలపాటి సురేష్ తీవ్ర అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే అతనిది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక నాయకులు విషయాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 60 వేలు మంజూరు చేయించారు. కాగా ఈ చెక్కును విజయనగరంలోని తన కార్యాలయంలో బాధితుడికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, నాయకులు డి. లక్ష్మణరావు, ఎం. లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించండి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం ఫోర్ట్: పేదలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక బాబామెట్ట ఏడు కోవెళ్ల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ తుషార్ హోమియోపతిక్ అండ్ ఏస్తటిక్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవాధృక్పథంతో రోగులకు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డాక్టర్ శివరామ్, డాక్టర్ వీఎస్ ప్రసాద్, డాక్టర్ కేవీ మురళీమోహన్, డాక్టర్ చిట్టి రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి



సమాశేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

భోగాపురం: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ డీలర్లకు సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డీలర్ల వద్ద నుంచి ఎండీయూ సిబ్బంది రేషన్ సరుకులు తీసుకుని లబ్ధిదారులకు అందించాలన్నారు. ఈ మధ్య కాలంలో డీలర్లకు, ఎండీయూ సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా కొన్ని ఇబ్బందులు వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇకపై అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో రూ.54 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు కార్యాలయాల ఆధునికీకరణ, సభావేదిక నిర్మాణం చేపట్టామని ఆయన చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభూజీరాజు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు, యువ నాయకుడు బొత్స సాయిగురునాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, గొండేల ఈశ్వరరావు, గొట్లాం ,రాచకిండాం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు మహంతి రమణ, జి.సతీష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీఓ ఎస్.హరిహరావు, పంచాయతీరాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



బొండపల్లి: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



చీపురుపల్లి: బాధితురాలు సరోజినికి చెక్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

బొండపల్లి: మండలంలో ఇద్దరికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండల కేంద్రంలో గురువారం అందజేశారు. గొల్లుపాలెం గ్రామానికి చెందిన రొంగళి అక్కమ్మ, మరువాడకు చెందిన దాసరి సోమమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరగా.. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేశారు. అక్కమ్మకు రూ.2.80 లక్షలు, సోమమ్మకు రూ.1.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను అనారోగ్య బాధితులకు ఎమ్మెల్యే అందజేసి, మెరుగైన వైద్యసేవలు పొందాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.ప్రభూజీరాజు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు బొత్స సాయి గురునాయుడు,గొల్లుపాలెం సర్పంచ్ పోతల రమణమ్మ,నాయకులు పోతల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం

చీపురుపల్లి: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపన్నహస్తంలా ఆదుకుంటోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు.చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేట గ్రామానికి చెందిన ఉత్తరావల్లి సరోజిని కుమార్తె స్వాతి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని ఎంపీని కోరగా, ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.52 వేలు మంజూరు కాగా, సంబంధిత చెక్‌ను బాధితురాలి తల్లి సరోజినికి ఎంపీ పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఎంపీటీసీ గిరడ రాందాసు, వార్డు మెంబర్ పోలీసు తదితరులు పాల్గొన్నారు.

'అవంతి'లో ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ బృందం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వ హించారు. బెంగుళూరుకు చెందిన కోడ్ నెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌ఆర్ టీమ్ రఘుల్, గజేంద్రసింగ్ విద్యార్థులకు ఆన్ లైన్ పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, మౌఖిక ఇంటర్వ్యూలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపిక లకు అన్ని అవంతి విద్యాసంస్థల నుంచి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వివిధ బ్రాంచ్‌లకు చెందిన 126 మంది విద్యార్థులు హాజరు కాగా 28 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, జావా, పైథాన్, ఫుల్‌స్టాక్, టెస్టింగ్ టూల్ తదితర కోర్సుల్లో కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం అల్ట్రాఇన్ఫోటెక్, ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్, సోనాట సాఫ్ట్‌వేర్, బైట్ల సాఫ్ట్‌వేర్, సింగపూర్ ఇన్ఫోటెక్ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు.

పార్వతమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



క్యూలో బారులుతీరిన భక్తులు



పూజలందుకుంటున్న పార్వతమ్మ

పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కొప్పెర్ల పార్వతమ్మ జాతరకు రెండో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చేరుకునే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా మాఘమాసంలో మూడురోజుల పాటు ఇనకోటి వంశీయులు ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం విద్యుత్ బల్బులతో అందంగా అలంకరించారు. ఎస్సై ఎ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనకు తీర్మానం



సమావేశమైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

లక్కవరపుకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో పలు మౌలిక వసతుల కల్పనకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానం చేసిందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు తెలిపారు. పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరా వు మాట్లాడుతూ ఆస్పత్రికి కుర్చీలు, ఫ్యాన్‌లు సమకూర్చుతామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో భవన నిర్మాణ పనులను కమిటీ సభ్యులు పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంపీ డీఓ కె.రూపేష్, వైద్యులు అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.